వానా.. నానా హైరానా

- నగరంలో ఎక్కడికక్కడే ముంపు
- చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు
- జన జీవనానికి తప్పని పాట్లు



వర్షం నీటితో నిండిన పేపర్‌మిల్లు నుంచి దేవీచౌక్‌కు వెళ్లే కృష్ణానగర్ ఏరియా (ఫైల్)



కంబాలచెరువు వద్ద వర్షం కారణంగా గొడుగు వేసుకుని ఇలా వెళ్తూ..

సీటీఆర్ఐ: నగరం... నీటితో సహవాసం అన్నట్లు ఉంది. చిన్నపాటి వర్షానికే ముంపునీరు ఎక్కడికక్కడే తిష్ట వేస్తోంది. అక్కడ ఇక్కడ అని చెప్పుకోవడానికి ఏముందీ అన్ని ప్రాంతాల్లో దాదాపు ఇదే పరిస్థితి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం ఒక సమస్య అయితే, ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయి నీరు ముందుకు కదలక రోడ్ల మీదకు వస్తోంది. దీంతో జనజీవనానికి ఆటంకం కలుగుతోంది.. బుధవారం రాజమహేంద్రవరం అర్బన్‌లో 2.4 శాతం, రూరల్‌లో 8.5 శాతం వర్షపాతం నమోదు అయ్యింది. చిన్నపాటి వర్షానికే కాలువల్లో చెత్త రోడ్డుపైకి వస్తోంది. దీనికితోడు వర్షపునీరు ఇళ్ల ముందు నిలిచిపోతుంది. మంగళ, బుధవారం కురిసిన వార్షానికి వీధుల్లో నీటితోపాటు చెత్త కారణంగా దుర్గంధభరిత వాతావరణం నెలకొంది.

ముంపు... కంపు

రాజమహేంద్రవరం నగరంలో ప్రధానంగా ఆర్యాపురం, లలితానగర్, వీరభద్రపురం, బోధిస్కూల్, కృష్ణానగర్, ఆదెమ్మ దిబ్బ, లింగంపేట, వాంబే గృహాలు, ఎస్ఆర్‌సీ లైన్ ప్రాంతాల్లో ముంపు సమస్య అధికంగా ఉంది. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దీనివల్ల నీరు రహదారిపై తిష్ట వేస్తోంది. వాహనదారులు, నడిచి వెళ్లాలన్నా ఇబ్బందే. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలతో ఇక్కడ రోడ్లపై వర్షం నీరు స్థానికులను ఇబ్బందుల పాల్జేస్తోంది. ఈ నీటిని తోడించి సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.

చిరు వ్యాపారం.. దూరం

నగరంలో చాలా ప్రాంతాల్లో తోపుడు బండ్లు, రోడ్ల పక్కన వ్యాపారం చేసేవారికి ఈ వాన ఇబ్బందులు తెచ్చిపెట్టింది. కూలి పనులు లేక, చిరు వ్యాపారులు సాగక చాలామంది అవస్థలు ఎదుర్కొన్నారు. వర్షం ఎక్కువగా కురవడంతో వాతావరణం కొంత ఆహ్లాదకరంగా మారినప్పటికీ చిరు వ్యాపారాలకు బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. విక్రయించడానికి తెచ్చిన పండ్లు, కూరగాయలు, పూలు తడిసిపోవడంతో వీటిని కొనేవారు లేక ఆవేదన చెందారు. బుధవారం సాయంత్రం కాస్త తెరుపు ఇవ్వడంతో తిరిగి అక్కడక్కడ వ్యాపారాలను ప్రారంభించారు.

కాస్త చల్లబడి..

కొద్ది రోజులుగా భానుడు తన విశ్వరూపం చూపుతున్నాడు. ఎండలతో మండిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటడంతో ప్రజలంతా చాలా ఇబ్బందులు గురయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం కాస్త బడింది. రుతుపవనాల రాకతో వర్షం పడుతుండటం ఆనందంగా ఉన్నప్పటికీ రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు నానా హైరానా పడ్డారు. దీనికితోడు చాలాచోట్ల గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

ఫ్లైఓవర్‌పై ఒక్క లైటూ వేయలేరా!

- కూటమి ప్రభుత్వంలో ప్రయాణికులకు అవస్థలు
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్



మోరంపూడి ఫ్లైఓవర్‌పై లైట్లు లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులను ఎన్‌హెచ్ అధికారికి వివరిస్తున్న మాజీ ఎంపీ భరత్‌రామ్



ఎండీయూ ఆపరేటర్లతో ర్యాలీగా వస్తున్న మాజీ ఎంపీ భరత్ తదితరులు

రాజానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా, ఇంతవరకూ మోరంపూడి ఫ్లైఓవర్‌పైఒక్క లైటు కూడా వేయలేకపోయిందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రభుత్వ అసమర్థతకు ఇంతకంటే మరో ఉదాహరణ ఏం కావాలన్నారు. ఫ్లైఓవర్‌పై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి, సర్వీసు రోడ్లను బాగు చేయాలని కోరుతూ దివాన్‌చెరువులోని నేషనల్ హైవే కార్యాలయంలో డీజీఎం సురేంద్రనాథ్‌కు బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్‌పై విద్యుత్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే సర్వీసు రోడ్లను పట్టించుకోకపోవడం వల్ల మోకాల్లోతు గుంతలతో ఉన్న ఆ రోడ్లపై ప్రయాణించడానికి ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఆ గోతుల్లో ఇటీవలే ఒక లారీ పడి, చక్రాలు విరిగిపోయాయంటే పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించడానికి ఆరాటపడిన కూటమి పాలకులు, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించడంలో ఎందుకు శ్రద్ధ చూపలేకపోతున్నారని ప్రశ్నించారు. ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయిస్తానని ఇచ్చిన మాటను నెరవేర్చానని గుర్తు చేస్తూ, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తే ఆ క్రెడిట్ తనకెక్కడ వస్తుందోనని కూటమి పాలకులు భయపడుతున్నట్టున్నారంటూ ఎద్దేవా చేశారు. ఈ ఫ్లైఓవర్ సమయంలోనే లాలాచెరువు, బొమ్మూరు, ఐటీసీ జంక్షన్, వేమగిరి జంక్షన్లలో ఫ్లైఓవర్ల నిర్మాణాలకు రూ. 395 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. ప్రస్తుతం వీటిలో బొమ్మూరు జంక్షన్ వద్ద చేసిన ప్రతిపాదనను పక్కన పెట్టినట్టుగా తెలుస్తుందన్నారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు భవిష్యత్తులో ఎదురయ్యే ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏవీ అప్పారావు రోడ్డు, జేఎన్ రోడ్డు జంక్షన్లకు కూడా ఫ్లైఓవర్ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే ఐటీసీ సెంటర్ లాలాచెరువు జంక్షన్ల మధ్య సింగిల్ ఫ్లైఓవర్‌ను ఏర్పాటు చేయించాలన్నారు. రాబోయే పుష్కరాలకు ముందుగానే ఈ పనులన్నీ పూర్తి కావాలని, లేకుంటే వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యాలకు గురికావాల్సి వస్తుందని భరత్‌రామ్ హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, గుత్తుల మురళీధర్, మార్తి లక్ష్మి, దాసి వెంకట్రావు, మజ్జి అప్పారావు, కడియాల శ్రీను, పీత రామకృష్ణ, సప్పా ఆదినారాయణ, గణేష్, చీర రాజు, బొప్పన సుబ్బారావు, మునీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లకు మద్దతు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరకులను పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లను రోడ్డున పడేయడం దారుణమని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లకు భరత్ మద్దతు పలికారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరో 18 నెలల గడువు ఉన్నా తమను తొలగించడం దారుణమని ఆపరేటర్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని మండిపడ్డారు. వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని, ఎండీయూ ఆపరేటర్లు ఐక్యత వర్ధిల్లాలని నినదించారు. ఈ సందర్భంగా ఎండీయూ ఆపరేటర్లతో కలసి ఆందోళనలో పాల్గొన్న మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇష్టం వచ్చినట్లు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక ఇష్టారాజ్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ తీరుతో 18 వేల కుటుంబాలు రోడ్డు పాలయ్యాయని భరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎండీయూ ఆపరేటర్ల డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆపరేటర్ల ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు



వైఎస్సార్ సీపీ మండల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, గూడూరి శ్రీనివాస్ తదితరులు

కడియం: అధికారంలోకి వచ్చేందుకు బూటకపు హామీలు ఇచ్చి ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండల పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి వేణు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క పింఛన్లు తప్పితే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని ఏడాది అవుతున్నా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. హామీలు అమలు చేయకపోతే తాను బాధ్యత తీసుకుంటానంటూ ప్రతి సమావేశంలోనూ ఊదరగొట్టిన పవన్ కళ్యాణ్‌కూడా ఇప్పుడు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ధాన్యం రైతులకు మద్దతు ధర లభించే విధంగా గత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని వేణు గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కారణంగా ప్రతి బస్తాకు రైతులు రూ. 200 నుంచి రూ.300 నష్టపోవాల్సి వచ్చిందన్నారు. అలాగే పొగాకు రైతులు గత ప్రభుత్వ హయాంలో కిలో రూ. 410 వరకు అమ్ముకోగలిగారన్నారు. ఇప్పుడు రూ. 210 ధర దక్కడం గగనంలా మారిందన్నారు. కరోనా సమయంలోనూ గత ప్రభుత్వం రూ.30 వేల కోట్లను ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేసిందన్నారు. అప్పటి అనుభవాల దృష్ట్యా 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం వాటిని నీరుగార్చేసిందన్నారు. పేదలకు ఇంగ్లిషు మీడియం చదువును కూడా చంద్రబాబు ప్రభుత్వం దూరం చేసిందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా పథకాల అమలు జరిగిందన్నారు. ఇప్పుడు అసలు పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే కార్యకర్తల బలంతో వైఎస్సార్ సీపీ రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టడం ఖాయమన్నారు.

ఉత్సాహంగా తరలివచ్చిన శ్రేణులు

మండల వైఎస్సార్ సీపీ సమావేశానికి వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ముందుగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన పార్టీ కార్యకర్తల మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రదాడిలో చనిపోయిన సాధారణ ప్రజలు, సైనికుల మృతికి సమావేశం మౌనం పాటించింది. అనంతరం పార్టీ భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, బడుగు ప్రశాంత్‌కుమార్, దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి తదితరులు కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఏకరవు పెట్టారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రానున్నది మన ప్రభుత్వమేనని, గతంలో జరిగిన పొరపాట్లు సరిచేసుకుని పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం పాటు పడతామన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. వలంటీర్లను తొలగించారని, ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి లేకుండా చేస్తున్నారన్నారు. ప్రజల్లో ఇప్పటికే ప్రభుత్వంపై తిరుగుబాటు ధోరణి మొదలైందన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలోనే పార్టీ నాయకులు నేరుగా వైఎస్ జగన్‌ను కలిసేందుకు తగిన కార్యాచరణ సిద్ధమవుతోందన్నారు.

నేడు హనుమద్ జయంతి



ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో ప్రసన్నాంజనేయ స్వామి

సీటీఆర్ఐ: హనుమద్ జయంతి సందర్భంగా రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్థానిక టీటీడీ కార్యాలయం వద్ద ఆంజనేయుని విగ్రహం వద్ద అన్నసమారాధనకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కంబాలచెరువు వద్ద సువర్చల సమేత ఆంజనేయస్వామి, శానిటోరియం వద్ద వ్రతధర రామచంద్ర స్వామివారి ఆలయం వద్ద అభిషేక మహోత్సవం నిర్వహించనున్నారు. ఆంజనేయ స్వామివారికి 108 కలశాలతో అభిషేక సేవ నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమద్ జయంతి సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకూ 31వ జయంతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. గురువారం స్వామివారికి పంచామృతాభిషేకం, తమలపాకులతో పూజలు నిర్వహిస్తారు. 23న స్వామివారికి సిందూరం, ఆకుపూజలతో పాటు జామపండ్లతో అలంకరించడం, 24న మామిడి పండ్లతో అలంకరణ, 25న నిజరూప దర్శనం, 26న పంచముఖ ఆంజనేయస్వామి అలంకరణ ఉంటుందన్నారు. 29న స్వామివారి ఊరేగింపు, పల్లకిసేవ జరుగుతాయని అన్నారు. 31న అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది.

కియోస్క్ ద్వారా సేవలు ఆగలేదు

రాజమహేంద్రవరం రూరల్: ప్రస్తుతం కియోస్క్ ద్వారా సేవలు ఆగలేదని రాజమహేంద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకుడు దల్లి శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో 'సేవలకు సెలవు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. గత ప్రభుత్వంలో విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ రైతుభరోసా కేంద్రాల ద్వారా కియోస్క్‌లో రైతులే నమోదు చేసుకునే విధానం తీసుకువచ్చారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సొసైటీల ద్వారా ఎరువులను అందుబాటులో ఉంచుతుందన్నారు. కియోస్క్‌లో విత్తనాలు, వాతావరణం, మార్కెట్ ధరలు, రైతుల బయోమెట్రిక్ తదితర వివరాలు జోడించి సాఫ్ట్‌వేర్ రూపొందించారన్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ కాబట్టి కియోస్క్ సేవలు అందుబాటులో ఉండవన్నారు. త్వరలో ఖరీఫ్ ప్రారంభం అవుతుంది కాబట్టి రాయితీ ద్వారా విత్తనాల సరఫరా ప్రక్రియ తదితర సేవలు కియోస్క్‌ల ద్వారా అందుబాటులో ఉంటాయని శ్రీనివాసరెడ్డి తెలిపారు.

రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: భారతదేశ ఐక్యత కాపాడాలన్న రాజీవ్ గాంధీ సిద్ధాంతమే నేడు అందరికీ ఆదర్శమని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్లా షరీఫ్ కొనియాడారు. బుధవారం నగరంలో మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక సీతంపేట వాటర్ ట్యాంకుల పార్కు ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి సాంకేతిక విద్యను పరిచయం చేసి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాజీవ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాసరావు, పీసీసీ కార్యదర్శి బెజవాడ రంగారావు, డీసీసీ ఉపాధ్యక్షుడు దేవత సుధాకర్, బత్తిన చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంగా రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రంగా రాజమహేంద్రవరం ప్రాంగణాన్ని నిర్ణయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం పట్ల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తాను చేసిన విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించి తగు నిర్ణయం తీసుకున్నందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

సీటీఆర్ఐ: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రధాన కేంద్రం చేయడానికి ఎంతో కృషి చేశానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. దీనికి రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలియజేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి



ఆందోళన చేస్తున్న కడియం మండల ఎండీయూ ఆపరేటర్లు

కడియం: ప్రతి ఇంటికీ రేషన్ పంపిణీని కొనసాగించాలని కడియం మండల ఎండీయూ ఆపరేటర్లు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం తమకు ఉపాధి కల్పిస్తూ ఆరేళ్ల పనిచేసే విధంగా నియమించిందన్నారు. అప్పటి వరకూ కొనసాగిస్తే ప్రత్యామ్నాయాలు చూసుకుంటామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు తొలగిస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు చెల్లుబోయిన దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు యనమదల మణికంఠ, సభ్యులు పాల్గొన్నారు.

వేణును మర్యాద పూర్వకంగా కలసిన మార్తి లక్ష్మి



వేణుగోపాలకృష్ణకు మొక్కను అందజేసి శాలువాతో సత్కరించిన మార్తి లక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను బుధవారం బొమ్మూరులోని ఆయన కార్యాలయంలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆమె మొక్కను అందించి, శాలువాతో సత్కరించారు. వేణు మాట్లాడుతూ మహిళా సమస్యలపై నిరంతరం వైఎస్సార్ సీపీ తరఫున పోరాడుతూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అంగాడి సత్యప్రియ, కృష్ణవేణి, అనురాధ, మార్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా అమలు చేయాలి

ప్రకాశంనగర్: ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తక్షణమే రైతు భరోసాను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జాతీయ నాయకురాలు పి.తాన్యా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మావోభవన్‌లో సంఘ జిల్లా కమిటీ అధ్యక్షుడు చిట్టిబాబు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. రైతులకు రాయితీపై విత్తనాలు, పురుగు మందులు పంపిణీ చేయాలని, సూపర్ సిక్స్ పథకాలు అందించాలని, తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేసి, కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ప్రకాశంనగర్: ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థను కొనసాగిస్తూ, ఇంటి వద్ద రేషన్ సరకులు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎండీయూ వ్యవస్థను మరింత మెరుగుపరచాలే తప్ప, రద్దు చేయడం సరికాదన్నారు.

సుబ్బారావు మృతికి సంతాపం



సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: వైఎస్సార్ సీపీ నాయకుడు శాకా పట్టాభి తండ్రి సుబ్బారావు మృతికి రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం కడియంలో ఆయన స్వగృహానికి వెళ్లి సుబ్బారావు చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. నాగేశ్వర్ వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

జూన్ 5న ప్రభుత్వ ఉద్యోగుల చలో విజయవాడ

- అంతా కలసి జయప్రదం చేయండి
- జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు వర్మ



వీఆర్వోలతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ వర్మ

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జూన్ 5న విజయవాడలో పదివేల మందితో నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ వర్మ పేర్కొన్నారు. ఉద్యోగులంతా పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నల్లజర్లలో గోపాలపురం నియోజకవర్గ స్థాయిలో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీఆర్వోలు తమకు పనిభారం తగ్గించాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు.రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల రేషనలైజేషన్‌లో భాగంగా ఇటీవల విడుదల చేసిన జీవోతో వీఆర్వోలపై పనిభారం పెరగడం, మిగిలిన వీఆర్వోలను నిర్దిష్టమైన విధి విధానాలతో జీఓ జారీచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019కు పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానంలో రెవెన్యూ అధికారులను మండల తహసీల్దార్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్వోల సంఘ అధ్యక్షుడు జె.శామ్యూల్, డివిజన్ జాయింట్ సెక్రటరీ ఆర్.లక్ష్మణమూర్తి, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

యోగాపై ప్రజలకు అవగాహన కల్పించండి



యోగాసనాలను తిలకిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి, జ్యోతి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో జూన్ 21వ తేదీ వరకూ యోగా మాసాన్ని పాటిస్తూ యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి పిలుపునిచ్చారు. బుధవారం హుకుంపేటలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి కేఎన్ జ్యోతి అధ్యక్షతన మండల స్థాయి యోగాంధ్రప్రదేశ్ కర్టెన్ రైజర్ ఘనంగా నిర్వహించారు. శాంతామణి మాట్లాడుతూ యోగా సాధన ఒక వ్యాపకంగా మారేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు పలు యోగాసనాలు వేసి అందరినీ అలరించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎంఈఓలు తులసీదాస్, చందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిశ్రమల శాఖాధికారులతో భేటీ



పరిశ్రమల శాఖ అధికారులతో సమావేశమైన రత్నం అయ్యప్ప తదితరులు

కడియం: జిల్లా పరిశ్రమల శాఖాధికారి వాణీధర్, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ సత్యనారాయణలను సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు బుధవారం కలిశారు. కడియం ప్రాంత నర్సరీ రైతులకు ఉపయోగపడే విధంగా పోలీబ్యాగ్స్ ఫ్యాక్టరీ, ప్లాంట్స్ ప్యాకింగ్ యూనిట్స్ తదితర వాటి ఏర్పాటుకు తగిన కార్యాచరణపై వారితో చర్చించినట్లు రత్నం అయ్యప్ప తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీ తదితర ప్రోత్సాహకాలు తదితర వాటిపై అధికారులతో చర్చించామన్నారు. పాలకవర్గ సభ్యులు కొండేపూడి నాగు, తాడాల నాగేశ్వరరావు, రత్నం బాబ్జీ, పాటంశెట్టి శేషకుమార్, గాద నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి పురస్కారం



లోకేష్ నుంచి షైనింగ్ స్టార్ పురస్కారం అందుకుంటున్న కనితి కిషోర్

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దివ్యాంగ విద్యార్థి కనితి కిషోర్ పదో తరగతి ఫలితాల్లో 97 శాతం మార్కులు సాధించి షైనింగ్ స్టార్ పురస్కారం అందుకున్నాడు. మంగళవారం రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని ఆయన నివాసంలో కిషోర్‌కు గోల్డ్ మెడల్‌ను, జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్ఫూర్తి ప్రదాతలు రచించిన తొమ్మిది పుస్తకాల గిఫ్ట్ హ్యాంపర్‌ను అందించారు. జిల్లా నుంచి షైనింగ్ స్టార్‌గా ఎంపికైనది కిషోర్ ఒక్కరే. విద్యార్థి పురోగతికి కారణమైన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులను పలువురు అభినందించారని ఉపాధ్యాయుడు పీవీ రమణ తెలిపారు.